సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 24 । జనవరి । 2023



వారసులే నిర్వహించాలి
జాన్‌పహాడ్ దర్గా ఉర్సును రెహమతుల్లా అలే వారసులే నిర్వహించుకోవాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. - 8లో



100 పడకలకు పెంచాలి
కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. - 10లో

గరిష్టం/కనిష్టం 31.°/16°
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ మోసాలను గ్రహించాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: ప్రజలు ఆన్‌లైన్ మోసాలను గ్రహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పది ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఇతరులకు చెప్పవద్దని అన్నారు. ప్రజలు అపరిచితుల నుండి జాగ్రత్తగా ఉండాలని కోరారు. ప్రతి ఫిర్యాదును త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సామరస్యంగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

భట్రాజు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


జిల్లా అధ్యక్షుడు బొల్లేపల్లి రఘురామ కృష్ణంరాజు


ప్రధాన కార్యదర్శి దేనుమకొండ శేషంరాజు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని భట్రాజుల అన్నదాన సత్రంలో సోమవారం భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా సూర్యాపేటకు చెందిన బొల్లేపల్లి రఘురామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా మఠంపల్లి మండలం యాతవాకిల్లకు చెందిన దేనుమకొండ శేషంరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కమిటీలో సుమారు 20మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్టు నూతన అధ్యక్షుడు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన,సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవాన్ని జరిపి మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వర స్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

జంతువులపై కరుణతో మెలగాలి


పెదవీడులో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

మఠంపల్లి: సమాజంలోని ప్రతిఒక్కరూ జంతువుల పట్ల జాలి, దయ, కరుణతో మెలగాలని జిల్లా పశువైద్యాధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పెదవీడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన జంతు సంరక్షణ పక్షోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జంతువుల పట్ల మానవులు ఎలా మెలగాలి అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేసి మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ తీశారు. ఆ తర్వాత గ్రామంలోని పశు వైద్య ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, సర్పంచ్ సయ్యద్‌బీబీకుతుబ్, ఎంపీటీసీ వెంకటరెడ్డి, డాక్టర్లు శంకర్, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి


నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం నేరేడుచర్ల పట్టణంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

కొబ్బరికాయలు, పులిహోర లడ్డూ విక్రయానికి వేలం

మేళ్లచెరువు: వచ్చేనెల 18 నుంచి 22వ తేదీ వరకు మండల కేంద్రంలో జరిగే శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా దేవాలయంలో కొబ్బరి కాయలు, లడ్డూ, పులిహోర విక్రయాలకు సోమవారం వేలం నిర్వహించారు. వేలాన్ని నల్లగొండకు చెందిన కె.నగేష్ రూ.6.56లక్షలకు దక్కించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. గతేడాది కంటే రూ.1.56లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, దేవాయల ఈఓ కొండారెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, వర్రా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బాలికకు భరోసా!

ఆడపిల్లల చదువు, సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

- సమాజంపైనా అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్
- కిశోర బాలికలతో గ్రామ కమిటీల ఏర్పాటు
- లింగ నిష్పత్తి, అక్షరాస్యత పెంపునకు కృషి

నేడు జాతీయ బాలికా దినోత్సవం


సూర్యాపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



సూర్యాపేట: బాలికా సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. సమాజంలో బాలికలపై వివక్ష నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. సమాజంలో బాలికలపై చిన్నచూపు, కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలకు వెనుకాడడం లేదు. బాలికా వివక్షను నిర్మూలించేందుకు 2008వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ మిషన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా ఏటా జనవరి 24వ తేదీన మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

తగ్గుతున్న లింగ నిష్పత్తి

జిల్లా జనాభా సుమారు 13లక్షలు కాగా.. ఇందులో 0–14 వయస్సు గల బాలికలు 20వేల మంది ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 0–14 సంవత్సరాల బాలల లింగ నిష్పత్తి 918గా నమోదు కాగా..జిల్లాలో 917గా ఉంది. ప్రస్తుత అంచనా ప్రకారం జిల్లాలో లింగ నిష్పత్తి 950కి చేరుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అక్షరాస్యత నిష్పత్తి 996గా నమోదైంది. ఈ లెక్కన జిల్లాలో రోజురోజుకు లింగ నిష్పత్తి తగ్గడంతో పాటు బాలికల అక్షరాస్యత మెరుగుపడుతోంది.

అవగాహన కల్పిస్తూ..!

బాలికా సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతలా పాటుపడుతున్నప్పటికీ మారుమూల పల్లెల్లో వివక్ష పూర్తిస్థాయిలో తొలగిపోలేదు. బాల్యవివాహాలు, విద్యకు దూరంగా ఉంచడం తదితర అంశాలు అప్పుడప్పుడు చర్చకు వస్తున్నాయి. జిల్లాలో 2021–22 సంవత్సరంలో 53 బాల్య వివాహాలు, 2022–23లో 33 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అడ్డుకోవడం ఇందుకు నిదర్శనం. వీటిని నివారించేందుకు గాను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలబాలికల మధ్య అసమానత్వపు విద్య, పోషణతో పాటు బాలికల చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్యవివాహాలు, బాలికా అక్రమ రవాణా అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కిశోర బాలికలతో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సమాజంలో నడవడికపై అవగాహన కల్పిస్తున్నారు. అదే ఆపద సమయంలో చైల్డ్‌లైన్ నెంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, పోలీస్ 100, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్లను వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

బాలికా సంరక్షణ ఇలా..

బాలికల సంరక్షణ, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో నినాదంతో బాలికలను ఉన్నత విద్య, తదితర అంశాల్లో ప్రోత్సహించేందుకు 2015లో సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల సదనాలు, శిశు గృహాలు ఏర్పాటు చేసి అనాథ బాలికలకు ఆశ్రయాన్ని కల్పిస్తున్నారు. అదేవిధంగా బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కేజీబీవీలను ప్రారంభించి వసతి కల్పించి విద్యనందిస్తున్నారు. అయితే 2005 నుంచి 2013 వరకు అమలులో ఉన్న బాలికా సంరక్షణ పథకం కనుమరుగైంది. తెలంగాణ ప్రభుత్వం 2014లో బంగారు తల్లి పథకాన్ని తీసుకొచ్చినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండా పోయింది.

బాలికలపై ఎలాంటి వివక్ష చూపొద్దు

“జిల్లాలో బాలబాలికల నిష్పత్తి దాదాపు తగ్గుముఖం పడుతూ వస్తోంది. లింగ వివక్ష నివారణకు గ్రామస్థాయి నుంచే అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. బాలికలపై ఎలాంటి వివక్ష చూపొద్దు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.
– జ్యోతి పద్మ, ఐసీడీఎస్ పీడీ, సూర్యాపేట

ముగిసిన పెద్దగట్టు దిష్టి పూజ


సోమవారం తెల్లవారుజామున దేవరపెట్టె వద్ద పూజలు నిర్వహిస్తున్న యాదవులు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- కేసారం చేరిన దేవరపెట్టె

చివ్వెంల(సూర్యాపేట): తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ మహోత్సవం సోమవారం ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత గట్టుకు చేరుకున్న దేవర పెట్టెలోని దేవతావిగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెంతబోయిన, మున్న వంశస్తులు తమ వెంట తీసుకొచ్చిన తల్లి, పిల్ల గొర్రె పిల్లను బలిచ్చి బలిహరణ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున తల్లి పిల్ల మాంసంతో వండిన వంటను భక్తులకు వండించారు. అనంతరం దేవర పెట్టె ముందు పసుపుతో వేసిన ముగ్గును మున్న, మెంతబోయిన వంశస్తులు గొర్లవారితో కలిసి ఒక్కరాశిగా చేర్చి దానిని ఆలయం ముందుభాగంలో ఉన్న పుట్టలో పోశారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దేవరపెట్టెను సాయంత్రం యాదవులు భుజాలపై ఎత్తుకుని తిరిగి కేసారం గ్రామ తరలించి అక్కడ మెంతబోయిన వారి ఇంట్లో ఉంచారు. 15 రోజుల పాటు అక్కడే ఉంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి పౌర్ణమి రోజు పెద్దగట్టుకు తీసుకొస్తారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ కోడి సైదులు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, తండు శ్రీనివాస్ యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, వూర రామ్మూర్తి యాదవ్, డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాస శ్రీనివాస్, మొండికత్తి దుర్గమ్మ, జానయ్య, మెంతబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


గంప, బోనాలతో వస్తున్న మహిళలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఫిబ్రవరి 1 నుంచి అర్వపల్లి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ వార్షికోత్సవాలు
- కల్యాణానికి హాజరు కానున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్


అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

అర్వపల్లి: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏటా 15 రోజులపాటు వైభవంగా జరుగుతాయి. గత మూడేళ్ల నుంచి దేవస్థానానికి పూర్వ వైభవం తెచ్చేలా ఉత్సవాలను జరిపిస్తున్నారు. ఈసారి కూడా అదే రీతిలో జరిపేలా దేవాలయ పాలకవర్గం ఏర్పాట్లు చేస్తోంది. అర్వపల్లి జాతరకు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు.

ఫిబ్రవరి 18 వరకు వేడుకలు

స్థానిక శ్రీయోగానందలక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఉత్సవాలు 5న స్వామి కల్యాణోత్సవం, 7న రథోత్సవం, 9న పొన్నోత్సవం, 15న పారువేట కార్యక్రమాలు జరుగుతాయి. 18న స్వామి ఉత్సవ మూర్తులను జాజిరెడ్డిగూడెం దేవాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి. ఈసారి కూడా కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లు సమర్పించనున్నారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రధాన ఉత్సవాల రోజు సినీకళాకారులచే సాంస్కృతిక, హాస్యవల్లరి, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విజయవంతం చేయాలి

ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు శ్రీ వైఖానస శాస్త్ర ఆగమానుసార ప్రకారం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తాం. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.
– చిల్లంచర్ల విద్యాసాగర్, దేవాలయ చైర్మన్

గత వైభవాన్ని తెచ్చేలా ఉత్సవాలు

అర్వపల్లి దేవాలయానికి గత వైభవాన్ని తెచ్చేలా ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌ల సూచనలు, సలహాలతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
– దావుల వీరప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, చివ్వెంలలో కంటి పరీక్షల వివరాలు తెలుసుకుంటూ..

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజావాణిలో విన్నవించిన అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 26 దరఖాస్తులు అందాయని, వారిని రికార్డులో నమోదు చేసి ఆయా శాఖలకు అందించామన్నారు. ప్రతివారం ఫిర్యాదులు మరుసటి వారం నాటికి పరిష్కరించబడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

చివ్వెంల(సూర్యాపేట): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు ఉండ్రుగొండ గ్రామంలో కంటి వెలుగు శిబిరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలు ఉన్న పేదలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారి శోభ, సూపర్‌వైజర్లు శేషయ్య, శిరోమణి పాల్గొన్నారు.

గోదావరి జలాల పెంపు

అర్వపల్లి: జిల్లాకు గోదావరి జలాలను సోమవారం పెంచారు. ఇప్పటి వరకు జిల్లాకు 1,083 క్యూసెక్కుల జలాలు రాగా రైతులకు పెరిగిన నీటి అవసరం దృష్ట్యా సోమవారం 1,613 క్యూసెక్కులకు పెంచారు. ఇందులో 69 డీబీఎంకు 525 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 80 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 1000 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నట్లు నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు.


71 డీబీఎం కాల్వలో పారుతున్న నీళ్లు

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. తొలుత హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ప్రజలంతా సకల ఆయురారోగ్యాలతో ఉండాలని, దోష నివారణార్థం రుద్రహవనం జరిపించినట్లు పూజారులు తెలిపారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు చేశారు. గర్భాలయంలో, ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు చేసి హారతి ఇచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అంధత్వ రహిత సమాజానికి కృషి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం


వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట రూరల్: అంధత్వ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ తమ వంతుగా కృషిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాజీవ్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అవసరమైన కళ్ల అద్దాలు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మూడు ప్రత్యేక టీమ్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ప్రాతికేయులకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనులు ఖరారు

- జిల్లా వ్యాప్తంగా 51.39లక్షల పనిదినాలు కల్పించాలని నిర్ణయం
- శాశ్వత ప్రయోజనం కలిగించే పనులపై దృష్టి సారించిన అధికారులు


పస్తాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నాగారం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల ఎంపిక, పనిదినాల ప్రక్రియ ఖరారైంది. ఇటీవల వరుసగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో చేపట్టిన తీర్మానాల ఆధారంగా లక్ష్యాన్ని ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కూలీలకు ఈసారి 51.39లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు. ఆయా గ్రామ పంచాయతీలు వాటి పరిధిలోని అనుబంధ గ్రామాల్లో వస్తున్న కూలీల సంఖ్య ఆధారంగా చేయాల్సిన పనులు అంచనా వేశారు. ఇందుకు తగినట్లుగా ప్రణాళిక రూపొందించారు. వీటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

గత ఏడాది ఇలా...

జిల్లాలో 23 మండలాలు ఉండగా వీటి పరిధిలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,65,106 జాబ్‌కార్డులు ఉండగా, వీటి పరిధిలో 6,25,691 మంది కూలీలు నమోదయ్యారు. కాగా వీరిలో పనికి వెళ్లే కూలీలు 2,91,756గా ఉన్నారు. గతేడాది 2022– 23లో ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 51.71లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయినా లక్ష్యాన్ని మించి 60.61లక్షల పనిదినాలను కల్పించారు. ఈ ఏడాది 2023–24లో ఉపాధిహామీ లక్ష్యం 56.39లక్షలుగా నిర్ణయించారు.

బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదనలు పంపించాం



“వచ్చే ఆర్థిక సంవత్సరం 2023–24లో చేపట్టే ఉపాధిహామీ పనుల లక్ష్యాన్ని గ్రామసభలను ఏర్పాటు చేసి ఖరారు చేశాం. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పనికల్పించేలా ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్ ఆమోదం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. బడ్జెట్ ఆమోదం రాగానే జిల్లాలో ఉపాధి పనులను ప్రారంభిస్తాం.
– పెంటయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ, సూర్యాపేట

అవసరమైనవే గుర్తింపు..

గతంలో మాదిరిగా ఇబ్బడిముబ్బడిగా పనుల సంఖ్య కాకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన వాటినే చేపట్టేలా ఈసారి మార్పులతో కూడిన కూర్పు కన్పించింది. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యాన్ని చూపించారు. వాస్తవంగా చేపట్టాల్సిన పనులనే ఎంచుకున్నారు. మరోవైపు చిన్నాచితకా కాకుండా శాశ్వత ప్రయోజనాన్ని కలిగించే వాటిపై దృష్టి సారించారు. కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు సామగ్రి వినియోగ విషయంలో జిల్లాలో సరైన అంచనాలు రూపొందించారు. గత వార్షిక సంవత్సరంతో పోలిస్తే వచ్చే ఏడాది చేపట్టే పనిదినాల సంఖ్య 4.68లక్షలు అధికంగా పెరగడం గమనార్హం. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధంగా రోడ్లు వేయడంతోపాటు, ఉపరితల నీటి నిల్వ ట్యాంకులు, భూ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు మొగ్గు చూపారు. హరితహారంలో గుంతల తవ్వకంతో పాటు కంచెల ఏర్పాటు లాంటి వాటిని ప్రణాళికలో భాగం చేశారు. మరోవైపు గతానికి భిన్నంగా పర్యవేక్షణ చేపట్టేలా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ మోటారు చోరీ



చోరీ జరిగిన మోటారు పైపును పరిశీలిస్తున్న రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురం శివారులో గల కాల్వలు, బావుల వద్ద వ్యవసాయ మోటార్లను దుండగులు చోరీ చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పరిధిలోని నలుగురు రైతుల మోటార్లను చోరీ చేసిన దుండగులు, ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు గణపవరం మేజర్ కాల్వపై ఏర్పాటు చేసిన మోటారులోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు గుర్తించి రైతులు ఇబ్బందులు లేకుండా చూడాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి కోరారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



శ్రీనాథ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని పెద్దరావులపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మన్నె శ్రీనాథ్(21) ఆదివారం రాత్రి పెద్దరావులపల్లిలో పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దరావులపల్లి గ్రామశివారులోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టడంతో శ్రీనాథ్ ఎగిరి ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడిపోయాడు. ఈ క్రమంలో టైరు అతడి తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. కిష్టయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో శ్రీనాథ్ చిన్న కుమారుడు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో ఆ కుటుంబంలో పెనువిషాదం నెలకొంది.

జాన్‌పహాడ్ ఉర్సును వారసులే నిర్వహించాలి

- తీర్పు వెలువరించిన హైకోర్టు



హైకోర్టు తీర్పు కాపీలను చూపుతున్న ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారులు

సూర్యాపేట: పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో గల హజ్రత్ జాన్ పాక్ షహీద్ (రెహమతుల్లా అలే) దర్గా ఉర్సును రెహమతుల్లా అలే వారసులే నిర్వహించుకోవాల్సిందిగా హైకోర్టు తీర్పు వెలువరించినట్లు ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారు మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొంతకాలంగా జాన్‌పహాడ్‌కు చెందిన మోహినుద్దీన్ కుటుంబ సభ్యుడు సయ్యద్ జానీ దర్గా వద్ద ముజావర్‌గా కొనసాగుతూ అధికారులు, వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. మోహినుద్దీన్ కుటుంబ సభ్యులు ముజావర్‌గా కొనసాగడంపై తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూపీ నంబర్ 27712/2014, 24198/2015 పిటిషన్లను విచారించిన హైకోర్టు మోహినుద్దీన్ కుటుంబ సభ్యులకు దర్గాకు సంబంధించి ఎలాంటి హక్కులు లేవని తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. పాలకవీడుకు చెందిన రెహమతుల్లా అలే వారసులు మహమ్మద్ అహ్మద్ హుస్సేన్, మహమ్మద్ ఇమాముద్దీన్, మహమ్మద్ గులాం రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ సలార్, మహమ్మద్ గౌస్ దర్గా హక్కుదారులని హైకోర్టు తెలిపిందన్నారు. అనంతరం దర్గా హక్కుదారుడు మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే దర్గా ఉర్సుకు రావాల్సిందిగా మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కరరావు, బొల్లం మల్లయ్యయాదవ్, సూర్యాపేట కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో హక్కుదారులు గులామ్ రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ సాలార్ ఖాద్రీ, మహమ్మద్ గౌస్ బాబు, మాజీద్, రియాజ్ పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వృద్ధుడు మృతి



లింగయ్య మృతదేహం

కేతేపల్లి: గుర్తుతెలియని కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య(65) చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట ఉన్న లిటిల్ విలేజ్ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా సోమవారం లింగయ్య హోటల్‌లో విధులకు హాజరయ్యేందుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన లింగయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఆగకుండా పరారయ్యాడు. మృతుడి కుమారుడు జానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

శిలాఫలకంపై పేరు పెట్టలేదని కూల్చివేత

- బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు

నల్లగొండ క్రైం: తమ ఊరి పేరు, ఉప సర్పంచ్ శిలాఫకంలో పెట్టలేదని దానిని కూల్చివేసిన ఏడుగురిపై నల్లగొండ రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. నల్లగొండ మండలంలోని రెడ్డికాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని బట్టపోతులగూడెం వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకంపై గ్రామ ఉప సర్పంచ్ దార శంకర్ పేరు, బట్టపోతులగూడెం పేరు పెట్టలేదని గ్రామస్తులు ఆరోపించారు. తాను దళితుడిని కావడంతోనే తన పేరు శిలాఫలకంపై పెట్టలేదని, ఇదే విషయాన్ని సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఉప సర్పంచ్ దార శంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అయితే కార్యక్రమం ముగించుకుని ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత పలువురు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీంతో సోమవారం గ్రామ కార్యదర్శి బొర్ర సుజాత నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దార శంకర్, దార పాండు, దార శివ, దార మహేష్, దార భిక్షమయ్య, రేఖల అంజనేయులు, సుంకరబోయిన శివకుమార్పై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. అయితే బట్టపోతులగూడెం గ్రామ దళితులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తామంతా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారిమని, సర్పంచ్ గెలుపు కోసం కీలకంగా పనిచేశామని, శిలాఫలకంలో తమ పేరు లేదని ప్రశ్నించినందుకు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టొద్దని వాపోయారు.

మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి తదితరులు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్య బృందం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని గుర్రపు బగ్గిపై ప్రతిష్ఠించి కేరళ నాదస్వర, మృదంగ బృందం, మహిళల కోలాటాల నడుమ పురవీధుల గుండా నూలు దండల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, మహాజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్నాటి పాండు, అంకం మురళి, కౌన్సిలర్లు గుండు మధు, భోగ భానుమతివిష్ణు, రుద్ర శ్రీశైలం, సూరెపల్లి రమేశ్, భోగ స్వామి, ధర్మకర్తల మండలి ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి రాజారమేశ్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ వరకు అంధుల పాఠశాల కొనసాగింపు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో డ్వాబ్ సంస్థచే నిర్వహించబడుతున్న అంధుల పాఠశాలను ఈ ఏడాది ఏప్రిల్ వరకు కొనసాగించనున్నట్లు డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అధికారులకు తెలియజేశారు. అంధుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సోమవారం నల్లగొండ ఎంఈఓ నర్సింహ, సీడీపీఓ నిర్మల వచ్చి పాఠశాలను పరిశీలించారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 18 నుంచి పాఠశాలను ప్రారంభించడం జరిగిందని పాఠశాల నిర్వాహకులు అధికారులకు వివరించారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు పాఠశాల నిర్వహిస్తామని, ఈ విద్యా సంవత్సరం పూర్తి అయ్యే వరకు విద్యార్థులకు విద్య అందించడం జరుగుతుందని తెలియజేశారు. బడి మూసివేసినా అంధులకు కంప్యూటర్ శిక్షణ, అంధ వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం డ్వాబ్ సంస్థ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



సాయిసింగ్ (ఫైల్)

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బొందుల సాయిసింగ్(39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమారుడు ఆకాష్‌సింగ్‌ను తీసుకొని ఈ నెల 19న దైవ దర్శనం నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. దర్శనం అనంతరం 21న ట్రెయిన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆకాష్‌సింగ్ అదృశ్యమయ్యాడు. కుమారుడిని వెతుక్కుంటూ ఆదివారం తూప్రాన్‌పేట గ్రామానికి చేరుకున్న సాయిసింగ్‌ను గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. సోమవారం మృతుడి సోదరి ఠాకూర్ శిరీష ఫిర్యాదు మేరకు ఎస్సై సీత పాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తప్పిపోయిన మృతుడి కుమారుడు ఆకాష్‌సింగ్ ఆదివారం సంస్థాన్ నారాయణపురం పోలీసులకు దొరికాడు. పోలీసులు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్

గరిడేపల్లి: పట్టు పరిశ్రమతో ప్రతి నెలా అధిక ఆదాయం పొందవచ్చునని సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పట్టు రైతులకు నైపుణ్య శిక్షణ తరగతులను కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్ హాజరై మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటగా మల్బరీ సాగు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు కేవీకే ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లవకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పట్టు పురుగుల పెంపకం చేపట్టిన రైతులతో పాటు సెరికల్చర్‌పై ఆసక్తి గల వారికి ములుగు జిల్లాలోని కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం రీజనల్ రీసెర్చ్ సెంటర్ ఆర్థిక సహకారంతో మూడు రోజుల పాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, సుగంధి, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



రెహమాన్ బాబాకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

నల్లగొండ క్రైం: పట్టణానికి చెందిన ఎండీ రెహమాన్ బాబా పానగల్లు బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సాక్షి యూనిట్ కార్యాలయంలో పనిచేస్తున్న గౌరు మల్లేష్‌కు ఆ సెల్‌ఫోన్ దొరకడంతో ట్రాఫిక్ పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్‌లో ఉన్న విజిటింగ్ కార్డు ఆధారంగా రెహమాన్ బాబాను గుర్తించి ట్రాఫిక్ సీఐ శ్రీను అతడికి సెల్‌ఫోన్ అందజేశారు.

సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రికి సతీవియోగం



వరలక్ష్మీదేవి (ఫైల్)

మఠంపల్లి: మఠంపల్లికి చెందిన బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి సతీమణి వరలక్ష్మీదేవి (78) సోమవారం తన స్వగృహంలో కన్నుమూశారు. లక్ష్మీనరసింహశాస్త్రి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భక్త రామదాసు పుట్టిన ఇంట్లో జన్మించారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం ఆయన మఠంపల్లికి వచ్చి వీవీ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. లక్ష్మీనరసింహశాస్త్రి భద్రాచలం, మట్టపల్లి దేవాలయాల్లో నిర్వహించే కల్యాణాలకు ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ప్రత్యక్ష వ్యాఖ్యాతగా వ్యవహరించి కీర్తి గడించారు. వరలక్ష్మీదేవి కూడా శ్రీకనకదుర్గ దేవాలయంలో పురోహితురాలిగా తన కుమారుడు, భర్తతో కలిసి పనిచేస్తున్నారు. వరలక్ష్మీదేవి మృతి పట్ల ఎంపీపీ పార్వతీకొండానాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సైదమ్మ, ఉప సర్పంచ్ జాల కిరణ్, గ్రంథాలయ చైర్మన్ బీవీ రామారావు, మన్నెం శేషిరెడ్డి, గాయం రామచంద్రారెడ్డి, భోనగిరి ప్రకాష్‌బాబు, కండె వెంకన్న, సురేష్‌గౌడ్, రవీందర్ తదితరులు నివాళులర్పించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పోల్కంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కాటేపాక సైదులు(33) బతుకుదెరువు నిమిత్తం పోల్కంపల్లి గ్రామానికి వలస వచ్చి ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైదులు చనిపోయాడని అతడి అన్న వెంకటయ్యకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో వెంకటయ్య తన బంధువులతో కలిసి పోల్కంపల్లికి వచ్చి సైదులు మృతదేహాన్ని పరిశీలించగా చెవుల కింద, మెడపై గాయాలు కనిపించాయి. తన సోదరుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మృతదేహంపై పచ్చబొట్లు గుర్తింపు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ వారులోని ఓ వెంచర్‌లో ఆదివారం లభ్యమైన సగం కాలిన వ్యక్తి మృతదేహానికి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి ఎడమ చేతిపై కావ్య అని, కుడి చేతిపై వృత్తాకారం మధ్యలో అమ్మ అని, కుడి భుజంపై సూర్యుని ఆకారంలో ఓం అనే పచ్చబొట్లు ఉన్నట్లు గుర్తించినట్లు నార్కట్‌పల్లి పోలీసులు తెలిపారు. ఈ గుర్తులు కలిగిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9440795635, 9440795610 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకం


- ఎంజీయూ రిజిస్ట్రార్ కృష్ణారావు



సెమినార్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణారావు తదితరులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకంగా మారిందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న యూనివర్సిటీలో 'రీసెంట్ టెక్నిక్స్ ఇన్ మ్యాథమెటికల్ అప్లికేషన్స్' అనే అంశంపై నిర్వహించనున్న సెమినార్‌కు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధి కల్పనలో గణితం పాత్ర కీలకమన్నారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హైమావతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి రవి, అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆకట్టుకున్న నెలవంక



ఆలయ గోపురంపై సుదర్శన చక్రానికి తాకినట్లుగా కనిపిస్తున్న నెలవంక

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై నెలవంక సోమవారం రాత్రి కనువిందు చేసింది. శ్రీస్వామి వారి ప్రధానాలయ సుదర్శన చక్రానికి నెలవంక తాకినట్లు కనిపించింది. సుదర్శన చక్రానికి నెలవంక పెట్టినట్లు అద్భుతంగా కనిపించడంతో చాలా మంది భక్తులు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

రథ సప్తమికి వేడుకలకు సిద్ధం



సిద్ధమవుతున్న సూర్యప్రభ వాహనం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 28న రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు సూర్యప్రభ వాహనాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి సూర్యప్రభ వాహనంపై ఆగమశాస్త్ర రీతిలో ఊరేగింపు చేపట్టనున్నట్లు ఆచార్యులు వెల్లడించారు.

బీఆర్‌ఎస్ వైపు దేశం చూపు



నిడమనూరులో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్ రెడ్డి

- కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగల పార్టీలు
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

నిడమనూరు : ప్రస్తుతం దేశం మొత్తం భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వైపు చూస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణను అభివృద్ధి చేసిన విధంగానే దేశ రైతాంగానికి మేలు చేయాలని సీఎం కేసీఆర్ ధృడ నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని.. రుణమాఫీ, రైతుబంధుతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ తోడు దొంగల పార్టీలని, వాటికి దేశ అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయడమే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమన్నారు. అంతకుముందు ప్రధాన రహదారిపై ఎడ్లబండి మీద మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఊరేగింపుగా వచ్చారు. మార్కెట్ చైర్మన్‌గా మర్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్‌గా మెరుగు రామలింగయ్యలతో పాటు డైరెక్టర్లతో వ్యవసాయ శాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల కేంద్రంలో సుమారుగా రూ.35 లక్షలతో పునర్నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయం, గోదాములను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు నోముల భగత్, ఎన్.భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, ఎంపీపీ బొల్ల జయమ్మ, కేవీ రామారావు, మన్నెం రంజిత్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, తాటి సత్యపాల్, శ్రీనివాసరెడ్డి, నర్సిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

నల్లగొండ క్రైం: మూగ వ్యక్తుల్లా నటిస్తూ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నల్లగొండ టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యేసు అలియాస్ దర్విడ్ నల్లగొండ పట్టణంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యేసుతో పాటు పట్టణంలోని కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన చింత యాదగిరి మూగ వారిగా నటిస్తూ ఏదైనా సాయం చేయమని ఇంటింటికి తిరుగుతుండేవారు. ఇంటి యజమానులు ఏదైనా సాయం చేద్దామని ఇంట్లోకి వెళ్లగానే వీరు సెల్‌ఫోన్‌లు, నగదు, విలువైన వస్తువులు చోరీ చేసి పరారయ్యేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్న చింత సుధీర్ ఇంటికి వెళ్లిన దొంగలిద్దరూ రెండు సెల్‌ఫోన్‌లు చోరీ చేశారు. చోరీ చేసిన సెల్‌ఫోన్‌లను సోమవారం రామగిరిలో అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకే గదిలో ఐదు తరగతులు



వంట గదిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్లు



తరగతి గదిలో కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న డాక్టర్

భువనగిరి పట్టణంలోని మాస్‌కుంట ప్రాథమిక పాఠశాలలో మొత్తం మూడు తరగతి గదులు ఉండగా రెండు గదుల్లో అధికారులు కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో సోమవారం పాఠశాలలోని చిన్న వంట గదిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు టీచర్లు పాఠాలు చెబుతూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా